# తృప్తి



బావాశివకోటి

"అల వైకుంఠ పురంబులో - నగరిలో- ఆ మూల సౌధమ్ములో"- అని పాడుకుంటూ వెళ్తున్న శేషావతారానికి కాలిబాటకడ్డంగా ఉన్న-పిల్లకాలువ ఎదురుపడటంతో రాగాలాపన ఆపి - దిగి వెళ్ళాలా? దూకి వెళ్ళాలా. అన్న ఆలోచన కలిగింది.

మొదట నడక ఆగింది.

మనిషి ఆగాడు.

కాలవలోకి దిగలేదు.

ఊపిరి బిగబట్టి పంచె ఎగగట్టి ఊపుగా అవతలకు దూకాడు.

దూకింతర్వాత-సక్రమంగానే దూకాను అనుకున్నాడు.

ఆ భావన-చాలా సంతోషాన్ని కలిగించింది.

తిరిగి నడక ప్రారంభమైంది.

ఆ మీదట-రాగాలాపన.

ఉత్సాహంగా మోరపైకెత్తి నడవసాగాడు.

"అయ్యగారూ," అని అకస్మాత్తుగా ఓ ఆడకంఠం వినిపించింది.

నడక ఆగింది.

దాంతో రాగం ఆగింది.

అటూ ఇటూగాక- చుట్టూరా చూశాడు ఓపికగా. ఏమీ కనిపించలేదు—

చెవులు రిక్కించాడు.

అయినా అలికిడి కూడా వినిపించలేదు.

ఓ క్షణం తటపటాయించి నడక ప్రారంభించబోయాడు.

కంఠం విప్పి రాగాలాపన చేద్దామనుకుంటూ వుండగా—

"మిమ్మల్నే"- అని వినిపించింది మళ్ళీ.

'నన్నేకదా!' అను కుంటూ శబ్దం వినిపించిన దిశకు మళ్ళాడు.

చలక్రతు – కంచగా వేసిన బారు తాడిచెట్ల ప్రక్కన - అందీ పొందని నీడలో ఓ ఆడ కూతురు ఒంటరిగా కనిపించింది.

ఆసక్తిగా చూశాడు.

చేయి చాపి పిలుస్తున్నట్టు అనిపించింది.

'తననేనా?' అన్న అనుమానం పొడచూపి- వెనక్కి తిరిగి చూసుకున్నాడు.

నిజంగా ఎవ్వరూ లేరు—

'అంటే తననే కదా' అనుకున్నాడు ఆ మరు క్షణం.

మరునిముషం పూర్తికాకముందే-ఆమెకు చేరువ అయాడు. "మిమ్మల్నే పిలిచింది"— అందా కంఠం.

నన్నేకదా ? అన్న భావన-చాలా చాలా గర్వంగా చూసేలా చేసిందతన్ని.

ఆగి చూస్తూనే ఉన్నాడు.

ఇరవై సంవత్సరాల వయసుంటుందా పిల్లకు!

అయితే-ఆ పిల్ల చంకలో– ఓ ఏడాది పసి కూన కూడా ఉంది.

పసిది ముద్దబంతి పూవులాగనిపించింది.

రెవికలోనుంచి ఆ పిల్ల స్థనాన్ని చిన్నారి చేతులతో బయటకు లాగి నోట పెట్టుకునేందుకు– వెంపరలాడిపోవటం కనిపించింది.

ఇంతలో స్థనం చివర-కూన నోటికందింది.

పొందికగా పట్టుకొని– పెదాలు కదలించింది.

అప్పటిదాకా– ఆరాటపడ్డ కళ్ళు-చనుమొన దొరకగానే తన్మయత్వంలో-మూసుకొనిపోయినయి.

ఆ కూనముఖంలో అలౌకిక ఆనందం మెదలింది.

ఈ దృశ్యం- శేషావతారం మనస్సులో కలవరాన్ని సృష్టించింది.

పిల్లదానిఅందం కన్ను చెదరుతుండగా-

కూన అదృష్టంపై ఈర్ష్య కల్గింది–

మనస్సులో-కసి—రేగింది.

ఓక్షణం- కళ్ళు మూసుకున్నాడు.

'అబ్బ' ఎంత అందమైందీ వ డు చు' అంది మనసు.

మామూలు ఎరుపే అయినా—

కోలముఖం అయినా-

జీవకళతో రెపరెపలాడుతున్న కళ్ళూ—

పల్చటి పాలుగారే చెక్కిళ్ళూ –

శిల్పాలలో కనిపించే చిరుగడ్డం—

ఆ గడ్డంపై పిసరంత – రాగివర్ణం పుట్టుమచ్చ-


## *1983* లో మా ఫలితాలు భవిష్యత్తుకు హామీనిస్తాయి!

**BANK CLERKS — 84%** **APPSC — 86%**

**BANK CLERKS, P. Os, APPSC Gr II (B), Gr IV**

ఇంజనీరింగ్, మెడికల్, నాగార్జునసాగర్ రెసిడెన్షియల్ కాలేజి

ఎంట్రన్సు క్లాసులు ప్రారంభమైనవి. ఫోన్ : 74636

# STUDIES 'N' EXAMS ACADEMY

మాచవరం, విజయవాడ-520 004

ఎత్తుగా చూపులని నిలిపే చనుకట్టు —
సన్నని ఒగువైన నడుమూ—
ప్రబంధ నాయిక సోయగాన్ని మించిన గోచీపెట్టిన చీరకట్టూ —
మృదువైన పాదాలూ —
'అబ్బో' అనిపించింది శేషావతారానికి.
నిగ్రహాన్ని కోల్పోయి- అడుగు ముందుకు వేయబోయాడు. దగ్గరిగా చేరి భుజాల్ని తడుముతూ- మాటాడాలనిపించింది. అడుగు వేసి-భుజాల్ని తాకబోయాడు -
తన్మయంగా పాలు త్రాగుతున్న పసికూన-శేషావతారం అలికిడికి-బుల్లి కళ్ళను తెరిచింది—
బెదురుగా చూసింది.
శేషావతారం కనిపించాడు-
రెప్పలాడించి చూస్తూ కూన నవ్వింది- నవ్వినపుడు లేత బుగ్గల్లో కనిపించిన సొట్టలు-అపురూపంగా అనిపించినయి.
పిల్ల చేతులాడిస్తూ-కేరింతలు కొట్ట సాగింది.
పసికూన వంక మొదట-చాలా అసహనంగా, పానకంలోపుడకలా చూశాడు.
కాని-
ఆ బోసినవ్వూ-కేరింతలూ- 'అబ్బో ఏమందం?' అనిపించింది.
కళ్ళు తాటించి-చేతులాడించటం చూసిన తరువాత- పిల్లపై వ్యామోహం తగ్గి- కూనను ఎత్తుకుని ముద్దాడాలనిపించింది.
ఆ మరుక్షణం-నిజంగానే కూనను— ఆమె అనుమతి లేకుండానే—చేతుల్లోకి తీసుకొని—లాలిస్తూ ఎగరేస్తూ, ముద్దులతో నింపేశాడు.
కూనతల్లి వంక—తిరిగి చూడాల్సిన అవసరంలేనంత ఆనందం అతని ముఖంలో కనిపించింది.
"రావులపాలెం ఎంత దూరం?" అని అడిగిందామె.
అప్పుడు చేతుల్లో కూననుంచి దృష్టి మరల్చాడు శేషావతారం.
ఇందాకటి మోహం కనిపించ లేదామె అందంపైన —
దోవన వెళ్తున్న అపరిచితను చూసినట్టుగా చూశాడు-
ఈ మార్పు — అతనిలో అతనికే ఆశ్చర్యాన్ని కల్గించింది ఓ క్షణం
"రెండు మైళ్ళుంటుంది" అన్నాడు ప్రశ్నకు సమాధానంగా.
"మీరూ అటేనా?" అంది తిరిగి.
"అవును. మాది ఆ వూరే"
"మరి-నడుద్దాం- పొద్దువాలిపోతూంది."
అంది అనుమానంగా దోవవంక చూస్తూ.
"మంచిది"అని నడక ప్రారంభించాడు.
రాగం మాత్రం బయటకు రాలేదు.
కొంతదూరం నడిచిం తర్వాత - ఆగి "పాపను తే! నేనెత్తుకుంటాను" అంది. కృతజ్ఞతగా చూస్తూ.
"ఫరవాలేదు" అని - ఊరిదాకా భుజాన మోశాడు.
"ఇక ఇవ్వండి-వెళ్తాను"అంది ఆగి.
"ఎవరింటికి?" అన్నాడవతారం కూనను భద్రంగా అప్పజెపుతూ.
సిగ్గుపడింది.
చెక్కిళ్ళు ఎఱ్ఱబడినయ్.
భర్త పేరు చెప్పేందుకు ప్రయత్నించింది.
తటపటాయించింది—
తిరిగి మొహమాటపడింది- కృతజ్ఞతగా చూసి,గిఱుక్కున తిరిగి వడిగాఅడుగులేసింది.
నాల్గడుగులు వేసింతరువాత "మా ఆయనింటికి" అని వినిపించింది.
'అదే ఆ ఆయనెవరు?' అని అడుగుదామనుకున్నాడు.
కాని- మలుపు తిరుగుతూ కనిపించింది.
ప్రశాంతంగా నవ్వుకున్నాడు— ●

## వసంత మహిమ

క్రుదుపుకై ఒక యింత కమ్మగా తినలేము
మహిత "రేషను కార్డు" మహిమ జేసి
బట్టకొనగబోవ బట్టబయలు నోరు
శ్రీ ధరల్ ధరవీడి యెగిరిపోవ



శాంతిమై యింటిలో యింత వందుద మన్న
వగులు నిద్రయు పైని పాడు కలలు
పోని యెచ్చటికైన బోయి వత్తమటన్న
ప్రాణాలు తీయు "రైళ్ల బస్సు"
లాచికొను యిన్ని బాధలద్రోచి. వచ్చె
మరి "ఉగాది" అనుకొనుచు మహిని కవులు
చేరి ఒకచోట వల్లింత్రు స్వీయ కవితలింతె కాబోలు నిద్ది వాసంత మహిమ.

—విశ్వనాథ పావనిశాస్త్రి

## రక్తాక్షి

ఈ కన్ను చలన బీజం
ఈ కన్ను ఎలిజీ
రెప్పల చప్పుడు చేస్తున్న
శబ్దం మాకు వారసత్వం

... గిరివాగభూషణం

## ఉగాది పూతలు

విరగ పూచిందమ్మ విరగపూచింది
గున్నమామిడి చూడు.
విరగ పూచింది
ఆకు గుబురులు కంటికగుపించవాయె!
పచ్చశాలువ పైన పరచినట్లాయె!
పువ్వు పువ్వూ ఒక్క పిందెగా
అయితే
పిందె పిందే ఒక్క కాయగా అయితే
కోసుకుంటే ఎన్ని రాసులయ్యేనో!



చేసుకుంటే ఎన్ని కాసులయ్యేనో!
పువ్వు పువ్వూ ఒక్క-పిందెగా అయితే
పిందె పిందే ఒక్క కాయగా అయితే
అంత బరువును చెట్టు ఓపగలిగేనా!
ఇంత చక్కని చెట్టు ఇట్లు నిలచేనా!

—కస్తూరి నరసింహమూర్తి

కొత్త నవలలు విడుదలయినాయి
లత-అనౌన్సర్ కృష్ణవేణి - రూ.14/-
లల్లాదేవి.ఓంకార్ సర్వనేత్రం - రూ.16/-
తోటకూర ఆశాలత-ఆరాత్రి ఏంజరిగిందంటే? - రూ.14/-
ఐ.వి.యస్.అచ్యుతవల్లి రాజకుమారి - ఇదిమల్లెలవేళ - రూ.15/-
ఆరతీమూర్తి ప్రేమరథం - రూ. 8/-
కీర్తి పబ్లికేషన్స్
TULASI KIRON

Printed and Published by K.L.N.Prasad at Andhra Printers Ltd., Vijayawada-10
Editor : Puranam Subrahmanya Sarma.